## గెలవండి రు.10,000 నగదు (లేదా) కలర్‌టివి!

"గెలవండి రు.1,25,000 విలువగల బహుమతులు. ఎంట్రీ రుసుంలేదు. మొదటి బహుమతి కలర్ టి.వి, లేదా రు.10,000 నగదు. కన్సొలేషన్ బహుమతి: అధునాతన ఇంపోర్టెడ్ జపాన్ మోడల్ టూ-ఇన్-వన్, రూ.240/-లకే, మా చెయిన్‌లింక్ స్కీము ద్వారా పొందవచ్చు. 12 నుండి 20 వరకుగల అంకెలు ఉపయోగించి అడ్డంగా, నిలువుగా, మూలగా, ఎటుకూడినా మొత్తం 48 వచ్చేట్లు గళ్ళు నింపండి. ఒక అంకె ఒకసారి మాత్రమే వాడాలి"—

ఇదీ ప్రకటన— 'ఈ ప్రకటనచూచి గబగబా గళ్ళు నింపి, యిచ్చిన అడ్రస్‌కు పోస్టుచేశాను.. పదిరోజుల్లో ఓ కవరు వచ్చింది, నాకు కన్సొలేషన్ బహుమతి వచ్చిందంటూ—ఆ మరునటిరోజు వి.పి.పి.లో ఒక పార్సల్ వచ్చింది. పార్సల్ పెద్దదే. 'టు-ఇన్-వన్' అయివుంటుందనుకొన్నాను. ఎంత నాసిరకందైనా రు.240/లకు రేడియో-కం-టేప్‌రికార్డర్ రాదుకదా? మా ఆయన వచ్చాక తీసుకుంటానని పోస్టుమాన్‌కు చెప్పి పంపాను. సాయంకాలం ఆయన వచ్చారు. వచ్చిన వెంటనే సాధించిన 'విజయం' విషయం ఏ కరువు పెట్టి, రు.240/-తో 'టూ-ఇన్-వన్', అదీ జపాన్ మోడల్, తప్పక తీసుకోవాలి' అన్నాను. "అదంతా మోసం—అయినా మనకుందిగా 'టేప్‌రికార్డర్—రేడియో'"అన్నారు. అహా—నేను వింటేకదా! "నేను అనుకోకుండా సాధించిన 'విజయం'. అయినా యిందులో మోసమేముంటుంది? మోసమయితే యింత బాహాటంగా చేస్తారా? ప్రభుత్వం పూరుకుంటుందా?" అంటూ ఏమేమో వాదించాను. చివరకాయన "నీ యిష్టం —ఆ తరువాత బాధపడి లాభం వుండదు" అన్నారు.

## పోటీ క్విజ్ ఫలితాలు

సరైన సమాధానాలు :

1. కరుణశ్రీ
2. పూర్ణాన
3. ఎనిమిదవ ఎడ్వర్డ్
4. రాజారామమోహనరాయలు
5. హిరోషిమా
6. ఏప్రిల్ 13, 1919
7. జాన్ ఎఫ్. కెన్నడీ
8. నర్మద
9. యూన్‌టిమొనిట్రి సల్ఫైడ్
10. డూరేవ్ట్‌లైన్

నిబంధనలను అనుసరిస్తూ, ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసినవారు ఒక్కరూ లేరు. ఒక తప్పుతో సమాధానం రాసిన వారు.

డి. శ్యామల, జులుంపాడు—507 120

బహుమతి మొత్తం రూ. 75 లు వీరికే అందజేస్తున్నాము.

చిట్టికథ

# తీరిన కోరిక



'ఇదేమిటి? ఎందుకిన్ని ఫొటోలు? రేషను కార్డుకైతే రెండు సరిపోతాయి" అన్నాడు అప్పారావు.

"అబ్బే... రేషనుకార్డు కోసం కాదు. పనుంది" అంది అండాళ్ళు. "ప్లీజ్ అండాళ్ళూ అన్నెందుకో చెప్పవా?" ప్రాధేయపడ్డాడు. "అలా అడగండి చెప్తాను. నేను శపథం చేశానండీ. ఏ పత్రికలోనైనా నా ఫొటో ప్రచురించబడాలని" అంది.

"ఆహా అలాగా! అయినా ఇన్ని ఫొటోలెందుకు? ఏంరాశావు?" అన్నాడు అప్పారావు కుతూహలంగా.

"అబ్బో... చాలా రాశాను. ముందుగా రెండు కథలు రాశాను. ఆ కథలతోపాటు రెండు ఫొటోలు కూడా ఆ రెండు పత్రికలకీ పంపిస్తాను. ఒక కాలం దాటని కథ, ఒక వ్యాసం రాశాను. ఆ రెంటికీ రెండు ఫొటోలు జతచేసి మరోరెండు పత్రికలకి పంపిస్తాను. ఒక కార్టూను గీశాను, రెండు జోకులు రాశాను. రెండు ప్రశ్నలు వేశాను... తరువాత అప్పడాలతో లడ్డు చెయ్యడం అనే వంటకం రాశాను... వీటన్నిటికీ ఫొటోలు జతచేసి పత్రికలకి పంపించాలి. చూస్కోండి ఈసారి నా ఫొటో ఏ పత్రికలోనైనా పడకతప్పదు" అని ఆగి ఊపిరిపీల్చుకుంది.

"ఫొటో లేకపోతే మాత్రం రాయకూడదా" అన్నాడు అప్పారావు. "అబ్బ, మీకేం తెలియదండీ. నా ఫొటో లేకపోతే అది రాసింది నేనేనని అందరికీ తెలియవద్దూ" అనడిగింది.

రాసినవాటికి ఫొటోలు జతచేసి కవర్లలో పెట్టి పంపించడానికి ఆండాళ్ళుకి రెండు రోజులు టైము పట్టింది.

ఒక నెల గడిచింది. వచ్చిన పుస్తకమల్లా మొదటి నుండి ఆఖరు పేజీ వరకూ వదలకుండా చూస్తోంది ఆండాళ్ళు.

ఒకరోజు యధాలాపంగా పేజీలు తిరగేస్తున్న ఆండాళ్ళు కళ్ళు జిగేల్‌మన్నాయి. తన ఫొటో! మళ్ళీ చూసుకుంది ఇంకోసారి ఆనందంగా తన కల ఫలించినట్లుగా చూసుకుంది. తనివితీరా చూసుకున్న తరువాత తను రాసిన ఏ రచనకి ఆ ఫొటో వేసేరా అని చూసుకుంది. అంతే!

"కెవ్వు"మని అరిచి పుస్తకం క్రింద పడేసింది.

"ఏమైంది" పరిగెత్తుకొచ్చేడు అప్పారావు. క్రిందనున్న పుస్తకం తీసేడు. పుస్తకం మడిచివుండడంవల్ల తీయగానే ఆ పేజీలో భార్య ఫొటో కనిపించింది.

"ఫొటో పడిందిగా ఇంకేం?" అన్నాడు పత్రికను పక్కన పెడుతూ...

"నా ఫొటో పడిందిగాని ఆ మేటరు నాది కాదండీ" అంది.

ఆమె కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఇక ఏడుపే తరువాయి!

"పోనీలే... నీ ఫొటో పడాలనేగా నీ కోరిక. పడిందిగా ఇంకెందుకు గోల?" అన్నాడు.

"ఇలాంటి శీర్షికలో ఫొటో పడకపోవడమే మంచిదండీ" అంది.

"ఆ... ఎక్కడయితే లెద్దూ" అన్నాడు తేలిగ్గా.

"అయ్యో రామ! 'పెళ్ళికొడుకు కావలెను' అన్న ప్రకటన క్రింద పడిందండీ" అంది కళ్ళవెంబడి నీళ్ళు తెచ్చుకుని.

"ఆ!" అన్నాడు అప్పారావు 'షాక్' తిన్నట్లుగా!

—కె.రుక్మిణీదేవి

[నిజజీవితంలో జరిగిన అనుభవమే ఈ చిట్టి కథకు ప్రేరణ. ఓ వారపత్రికకి ఒక వ్యాసం పంపించాను. అది పడలేదుగాని నా ఫొటో మాత్రం మరో వ్యాసంతోపాటు ప్రచురించేశారు!]

మరునాడు మా పోస్టుమాన్ పార్సెల్ తెచ్చాడు. రు.240/-ఆపై మరో 10 రూపాయలు చెల్లించి పార్సెల్ తీసుకున్నాను. ఆనందంతో లోనికెళ్ళి జాగ్రత్తగా దారాలు వగైరాలు విప్పాను. చుట్టిన కాగితాలు తీసిచూద్దును కదా, ఏముంది—అదో బొమ్మలాంటి "టు-ఇన్-వన్" లోపలేవో సామాన్లున్నాయి.. ఇంతాచేస్తే అది చిన్నపిల్లలు ఆడుకోడానికి పనికివచ్చే వస్తువులా వుంది. దాన్ని చూచి నా దుఃఖం ఆగలేదు, మా ఆయన వచ్చేసరికి ముభావంగా వున్న నన్ను చూసి—"ఏం, పార్సెల్ తీసుకోలేదా?" అన్నారు. బావురుమని యేడవాలనిపించింది. అయినా దుఃఖాన్ని అపుకుంటూ వచ్చిన పార్సెల్ చూపించాను.

ఇలాంటి ప్రకటనలు వేసేముందు ఈ 'బోగస్' సంస్థలుయిస్తున్న డబ్బుకు పత్రికలు ఆశపడుతున్నాయేకాని, ప్రజలు ఎలా మోసపోతున్నదీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా "మిక్సర్, గ్రైండర్, జ్యూసర్"లు, లేదా రు.10,000/ నగదు అనిచూసి మోసపోయేది ఎక్కువగా మహిళలే. ప్రభుత్వంవారు ఇలాంటి మోసపూరితమైన ప్రకటనలిచ్చేవారిని, ప్రచురించేవారిని కఠినంగా శిక్షించి, మహిళాలోకాన్ని కాపాడాలి!

—వి.విజయలక్ష్మిరెడ్డి, ప్రొద్దుటూరు